ఉప్పు స్థానంలో రొయ్యల సాగు

- ఉప్పు రైతులను పట్టించుకోని ప్రభుత్వం
- ప్రత్యామ్నాయంగా రొయ్యల చెరువులు
- ఉప్పునకు పెరిగిన గిరాకీ


కేపీపాలెంలో చెరువులుగా మారిన ఉప్పు మడులు


రహదారి పక్కన పోసిన ఉప్పు రాశులు (ఫైల్)

మొగల్తూరు: ఉప్పు పండించే రైతులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటపై దృష్టి సారించారు. ఆరుగాలం శ్రమించినా పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉప్పు సాగుపై ఆసక్తి చూపడం లేదు. గతంలో వెయ్యి నుంచి పదిహేను వందల ఎకరాల్లో ఉప్పు సాగు చేయగా ప్రస్తుతం ఉప్పు మడులన్నీ రొయ్యల చెరువులుగా మారిపోయాయి.

రొయ్యల చెరువులుగా మారిన ఉప్పుమళ్లు

నరసాపురం నియోజకవర్గంలో సుమారు 20 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. నియోజకవర్గంలో మొగల్తూరు మండలం కేపీపాలెం, నరసాపురం మండలంలో పీఎంలంక గ్రామాల్లో మాత్రమే ఉప్పు సాగు చేసేవారు. ఏడాదిలో వర్షాకాలం మినహా మిగిలిన కాలంలో మూడు పంటలూ ఉప్పు పండించే వారు. ఇప్పటికే వ్యవసాయ భూములను చేపలు, రొయ్యల చెరువులుగా మార్చేసి భవిష్యత్‌లో ధాన్యం కూడా దొరకని పరిస్థితికి తీసుకొస్తున్నారు. ఇదే పరిస్థితి తీర ప్రాంతంలోని ఉప్పు సాగుకు ఏర్పడింది. రాబోయే రోజుల్లో అప్పుకు కూడా ఉప్పు దొరకని పరిస్థితి రానుంది.

ఉప్పుకు గిట్టుబాటు లేక

పండించిన ఉప్పుకు గిట్టుబాటు లేక పోవడం, బ్యాంకులు రుణాలివ్వక అనేక ఇబ్బందులు పడ్డారు. దీంతో ఉప్పు సాగు చేయలేక రొయ్యల సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని తీర ప్రాంత గ్రామమైన కేపీపాలెం సౌత్‌లో సుమారు వెయ్యి ఎకరాల్లో ఉప్పు పండించే వారు. పండించిన ఉప్పును దాచుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేక గట్టుపైనే రాశులుగా పోసి ఉంచేవారు. వాతావరణం అనుకూలించక భారీ వర్షం కురిస్తే రాశులన్నీ ఉప్పు నీళ్లుగా మారేవి. పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా ఉండేది కాదు. 75 కేజీల బస్తా రూ.100 లేదా రూ.200లకు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.800ల ధరకు కొనుగోలు చేస్తున్నారు. తుఫాన్లు, భారీ వర్షాలు కురిస్తే ప్రభుత్వాలు వ్యవసాయ రైతులకు నష్ట పరిహారం అందించే వారు, బ్యాంకులు రుణాలందించేవి. అయితే ఉప్పు రైతులకు ఎటువంటి ఆర్థిక సహాయం అందకపోవడంతో విసుగు చెందిన రైతులు రొయ్యల సాగు వైపు దృష్టి సారించారు. చిన్న చిన్న ఉప్పు మడులన్నీ కలిపి పెద్ద పెద్ద చెరువులుగా మార్చేశారు. తీర ప్రాంతంలో వనామీ రొయ్యల సాగు బాగుండటంతో రైతలంతా వనామీ సాగు చేపట్టారు.

ఉప్పు రైతులు రొయ్యల రైతులుగా మారారు



ఉప్పు పండించే రైతులు రొయ్యల రైతులుగా మారారు. ఉప్పు పండించే రైతులకు పంట గిట్టుబాటు కాకపోవడం, ఉప్పు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రొయ్యల సాగు బాగుండటంతో రైతులు వనామీ చెరువులు తవ్వి సాగు చేస్తున్నారు.

అందే తాత, కేపీపాలెం

ఉప్పు ధర పెరిగిపోయింది



గతంలో 100 కేజీల ఉప్పు బస్తా రూ.150 లేదా రూ.200 ఉండేది. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.800లకు కొంటున్నాం. మేం గ్రామాల్లో తిరిగి నాలుగు కేజీలు (కుంచం) రూ.80 నుంచి రూ.100లకు అమ్ముకుంటున్నాం. రాబోయే రోజుల్లో ఉప్పు కూడా దొరకని పరిస్థితి ఏర్పడినా ఆశ్చర్య పడనవసరం లేదు.

మామిడిశెట్టి శ్రీను, ఉప్పు వ్యాపారి, తూర్పుతాళ్లు

రొయ్యల సాగు అనుకూలంగా ఉంది

ఉప్పు మల్లు స్థానంలో రొయ్యల చెరువులుగా తవ్వి సాగు చేస్తున్నాం. గతంలో ఎంత కష్టపడినా ఫలితం దక్కేది కాదు. ప్రభుత్వాలు కూడా ఉప్పు రైతులకు ఎటువంటి సహాయం అందించేవి కావు. దీంతో తమ ప్రాంతంలో ఉప్పు పండించే రైతులంతా రొయ్యల సాగు వైపు మారారు.

ఎ.రామారావు, కేపీపాలెం

క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి ఊరేగింపు


మొగల్తూరులో అమ్మవారి ఊరేగింపు

మొగల్తూరు: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అమ్మవారి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని కూరగాయల మార్కెట్‌లో నెలకొల్పిన అమ్మవారిని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. యువకుల నృత్యాలతో పాటు శక్తివేశాలు, బాణ సంచాకాల్పులతో అమ్మవారిని ఊరేగించారు. రామన్నపాలెం, కేపీపాలెం, పేరుపాలెం గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు.

డీఎన్నార్ కళాశాలలో వాల్మీకి జయంతి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు సెంట్రల్: భారతీయ జీవన చిత్రం రామాయణంలో ప్రతిబింబిస్తుందని ఉన్నతమైన మానవ విలువలతో కూడిన గ్రంథం రామాయణమని ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి అన్నారు. స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ వాల్మీకి రామాయణంలో, వారధి నిర్మాణంలో ఉడుత చేసిన సేవ ఎంతో భక్తితో కూడుకున్నదన్నారు. నేటి కుటుంబ వ్యవస్థ మానవ సంబంధాలు, ఆచార వ్యవహారాలు రామాయణంలో దర్శించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నోబుల్ రాజు, రేవతి, భాగ్యలక్ష్మి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు


వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెనుగొండ: భారీ వర్షాల నేపథ్యంలో విషజ్వరాలు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉండడంతో గురువారం వడలి పంచాయతీ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహించి వైరల్ జ్వరాలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తీవ్ర జ్వరం సోకిన వారిని పెనుగొండ, సిద్ధాంతం ఆసుపత్రులకు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శాంతకుమారి, రోజాకుమారి, వసుంధర, మంగా దేవి, సీహెచ్ శ్రీను, ఉప్పలపాటి చంటి, దొడ్డిపట్ల నాగూరు, బొర్రా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ అంగర వర ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గొంతేనమ్మ గ్రామోత్సవం


గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: వడలిలో గొంతేనమ్మ గ్రామోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలు నెల పాడుపు మొదలుకొని నెల రోజుల పాటు అమ్మవారి పూజలు నిర్వహించి, అట్ల తద్ది ముందు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘపెద్దలు వడ్డీ ఉదయకిరణ్, ఊటాల రాజశేఖర్, మాతా సురేంద్ర, జనిపెళ్ల వీర, గుమ్మడి బాలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొడమంచిలిలో

ఆచంట మండలం కొడమంచిలిలోనూ గొంతేనమ్మ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న హుండీ లెక్కింపు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గువారం స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా 127 రోజులకు గాను స్వామి వారి హుండీ లెక్కించగా రూ.19,36,321 వచ్చాయని కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్, తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి పండిత విల్లూరు సమూహ దేవాలయాల కార్య నిర్వహణ అధికారి దండు వెంకట కృష్ణంరాజు సమక్షంలో హుండీ తెరిచి, లెక్కించామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: పోడూరు మండలంలోని 33 కేవీ వల్లూరు ఫీడర్, 33/11 కేవీ పోడూరు సబ్‌స్టేషన్, 33/11 కేవీ కొమ్ముచిక్కాల సబ్‌స్టేషన్, పెనుమదం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ కొల్లాబత్తుల మధుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోడూరు, పండితవిల్లూరు, జగన్నాథపురం, కవిటం, వేడంగి, మట్టపర్రు, జిన్నూరు, గుమ్మలూరు, పైడావ, కొమ్ముచిక్కాల, పి.పోలవరం, వాలమర్రు, కాపవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

30న శేరేపాలెంలో గ్రామసభ

మొగల్తూరు: ఈ నెల 30వ తేదీన మండలంలోని శేరేపాలెంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రాజ కిశోర్ గురువారం తెలిపారు. గతంలో శేరేపాలెంలో నిర్వహించిన భూ సర్వేకు సంబంధించి భూ యజమానులకు ఏవిధమైన అభ్యంతరాలున్నా గ్రామసభలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. భూ యజమానులు, రైతులు ఈ సభను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ అధికారుల బాధ్యతల స్వీకరణ

నరసాపురం: మున్సిపల్ ఏఈగా నవ్య బాధ్యతలు చేపట్టారు. భీమవరం మున్సిపాలిటీ నుంచి బదిలీపై ఆమె వచ్చారు. ఇక్కడ రెండేళ్ల నుంచి ఏఈగా పని చేస్తున్న మణి భీమవరం బదిలీ అయ్యారు. మరో వైపు మున్సిపల్ డీఈ రమేష్‌ను విజయవాడ బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ కార్పొరేషన్ నుంచి బదిలీపై వచ్చిన ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పెనుగొండ: మండల పరిధిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.3 కోట్లతో 11 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శ్రీకారం చుట్టారని ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పెనుగొండలో రూ.2.15 కోట్లతో 5, వడలిలో రూ.55 లక్షలతో మూడు, సిద్ధాంతంలో రూ.30 లక్షలతో రెండు, చినమల్లంలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరైనట్లు తెలిపారు.

నేటి నుంచి రీసర్వే గ్రామసభలు

పెనుగొండ: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ స్థాయిలో రీసర్వేకు గ్రామసభలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పెనుగొండ తహసీల్దార్ జి.అనితకుమారి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ 18వ తేదీ ఉదయం 10 గంటలకు వెంకట్రామపురం, 2 గంటలకు మునమర్రులోనూ, 19వ తేదీ ఉదయం 10 గంటలకు కొఠాలపర్రు, మధ్యాహ్నం రెండు గంటలకు తామరాడలోనూ, 22వ తేదీ ఉదయం 10 గంటలకు రామన్నపాలెం, 23 తేదీ ఉదయం 10 గంటలకు ఇలపర్రులోనూ, 24వ తేదీ ఉదయం 10 గంటలకు నడిపూడిలోనూ, 25వ తేదీ ఉదయం 10 గంటలకు వడలిలోనూ, 26వ తేదీ ఉదయం 10 గంటలకు సిద్ధాంతంలోనూ, 29వ తేదీ ఉదయం 10 గంటలకు చెరుకువాడలోనూ నిర్వహిస్తామన్నారు. సమస్యలు ఉన్నవారు గ్రామసభ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం


రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోటలో మునిగిన పుంతరోడ్డు


పల్లపు ప్రాంతం నీట మునగడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా గత మూడు రోజులుగా మొగల్తూరు మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 14న తేదీన 19.2, 15వ తేదీన 21.2, 16వ తేదీన 24.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు నీటమునిగిపోవడంతో పాటు ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు చేరింది. రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోటలో పుంత రోడ్లలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరులోని గొల్లగూడెం రోడ్డు, కోటరోడ్డులో ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్ నుండి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రోడ్లలో నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యుత్ సిబ్బంది సేవలు భేష్


చెరువులో విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నర్సాపురం నుంచి పాలకొల్లుకు 33 కేవీ విద్యుత్ సరఫరా వస్తుంది. నరసాపురం నుంచి పాలకొల్లు వచ్చే ఈ లైన్‌కు అతి సమీపంలో పిడుగు పడడంతో ఇన్సులేటర్ పగిలి ఫ్లాష్ ఆనర్‌పై పడింది. ఆ పోల్ నరసాపురం రోడ్డులో ఉన్న చర్చి వెనుక చెరువులో ఉండడంతో విద్యుత్ శాఖ సిబ్బంది హుటాహుటిన స్పందించారు. రాత్రి చెరువులో దిగి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను అందజేశారు.

ముంపు సమస్య పరిష్కారానికి కృషి


దర్బరేవు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు

నరసాపురం రూరల్: రైతులకు ముంపు గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా వివిధ ప్రాంతాల్లో ఇరిగేషన్ పనులను చేపట్టి పూర్తి చేశారని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి గురువారం ఆయన ఈ పనులను పరిశీలించారు. నరసాపురం మండలంలోని దర్బరేవు డ్రెయిన్‌కు సంబంధించి రూ.23 లక్షలతో చేపట్టిన పూడికతీత పనులు, యలమంచిలి మండలం కాజ అవుట్ ఫాల్ స్లూయిజ్‌కు సంబంధించి రూ.20 లక్షలతో చేపట్టిన షట్టర్ పనులు, రుస్తుంబాద మీడియం డ్రెయిన్, నత్తలావ మైనర్ డ్రెయిన్‌కు సంబంధించి రూ.7.70 లక్షలు, బియ్యపుతిప్పలో రూ.12 లక్షలతో చేపట్టిన నల్లీ క్రీక్ బండ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులకు సంబంధించి నిధులను గత సంవత్సరం నవంబర్‌లో అప్పటి కలెక్టర్ అత్యవసర నిధుల నుంచి మంజూరు చేశారని ఇరిగేషన్ శాఖ అధికారులు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డికి వివరించారు. ఈ పర్యటనలో నరసాపురం ఆర్డీవో దాసి రాజు, నరసాపురం, పాలకొల్లు తహసీల్దార్లు టి.రాజరాజేశ్వరి, వై.దుర్గా కిషోర్, గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ కె.కాశీ విశ్వేశ్వరరావు, డ్రెయినేజీ డీఈ సీహెచ్ సత్యనారాయణ, కన్జర్వెన్సీ ఏఈ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని భూముల రీసర్వే పూర్తయ్యి కొత్త రికార్డులు తయారయ్యాయని వీటిలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత రైతులు గ్రామ సభల్లో ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ తెలిపారు. గురువారం దుర్గా కిషోర్ మాట్లాడుతూ పాలకొల్లు మండలంలో బల్లిపాడు, అరట్లకట్ట, చందపర్రు, గోరింటాడ, తిల్లపూడి, ఆగర్రు గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యి కొత్తగా రికార్డు తయారు చేయబడిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం రీసర్వే జరిగిన గ్రామాల్లో భూమి రికార్డులకు సంబంధించి ఏమైనా సమస్యలు అనగా భూమి కొలతలు, తేడాలు, పేరు మార్పులు, మ్యూటేషన్, జాయింట్ ఎల్‌పీఎం ఖాతాలను సబ్ డివిజన్ చేయుట వంటివి ఉన్న ఎడల రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. నేడు శుక్రవారం బల్లిపాడు గ్రామానికి సంబంధించి క్షత్రియ కల్యాణ మండపం, అక్టోబర్ 22న అరట్లకట్ట గ్రామంలో రైతు సేవా కేంద్రం, 24న చందపర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం, 25న గోరింటాడ గ్రామ పంచాయతీ కార్యాలయం, 29న తిల్లపూడి గ్రామ సచివాలయం, 30న ఆగర్రు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఈ గ్రామసభలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఈ గ్రామాలకు సంబంధించిన రైతులకు ఏమైనా భూమి రీసర్వేలో సమస్యలు ఉంటే గ్రామ సభల్లో ఫిర్యాదు చేయాలన్నారు.

నరసాపురం మండలంలో

నరసాపురం రూరల్: మండలంలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు రీసర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి పేర్కొన్నారు. ఇప్పటికే రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ సభల్లో తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ, వీఆర్వో, గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్ హాజరవుతారన్నారు. భూ సమస్యలు ఉన్నవారు తమ అర్జీలను ఈ సభల్లో అందజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు.

దాడి కేసు నమోదు

నరసాపురం: పాత గొడవల నేపథ్యంలో ఒంటరిగా ఉన్న మహిళపై దౌర్జన్యం చేసిన ఘటనలో మొగల్తూరు మండలం అబ్రహాంపేటకు చెందిన చొప్పల ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు టౌన్ సీఐ జి.యాదగిరి చెప్పారు. గురువారం పట్టణంలోని కాటన్‌పార్కు వద్ద ఉన్న సయ్యద్ నగీనాపై ప్రేమ్‌కుమార్ పాత గొడవల కారణంగా ఆమెను దుర్భాషలు ఆడుతూ దాడి చేసినట్లు నగీనా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

యలమంచిలి: మండలంలోని ఆర్యపేట, మేడపాడు గ్రామాలలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లకు గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఆర్యపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద రూ.10 లక్షలు, మేడపాడు అరుంధతీ కాలనీ, దళిత శ్మశాన వాటిక వద్ద రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేసి శిలా ఫలకాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యపేట, మేడపాడు గ్రామాల సర్పంచ్‌లు మేడిది విజయ జ్ఞానమణి, గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యులు డేగల సూర్యప్రభ, మానుకొండ చిట్టెమ్మ, తహసీల్దార్ గ్రంధి పవన్ కుమార్, ఎంపీడీవో నందిపాటి ప్రేమాన్విత, పంచాయతీరాజ్ డీఈ కలవకొలను దుర్గా రామస్వామి, ఏఈ వైవీఆర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

యలమంచిలి: జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి 30 వరకు ప్రతీ రెవెన్యూ గ్రామంలో గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 18న శుక్రవారం బూరుగుపల్లి, 19న శనివారం శిరగాలపల్లి, 22న మంగళవారం మేడపాడు, 23న బుధవారం చించినాడ, 24న గురువారం కలగంపూడి, 25న శుక్రవారం కాజ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్ ఉంటారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పబ్లిక్ నోటీస్

పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామం కాపురస్తులు (లేటు) మైలె వెంకటస్వామి గారి కుమారుడు ఆదినారాయణ (లేటు) ఇతని [illegible]

1) తెలంగాణా రాష్ట్రం, [illegible]

2) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం, మొగల్తూరు [illegible]

3) [illegible]

[illegible] Family members Certificate [illegible]

ఇట్లు, పాకా రమేష్, అడ్వకేట్, తణుకు

తణుకు

తేది :17.10.2024

సెల్ : 8309618301

శ్రీకృష్ణదేవరాయలుకు ఘన నివాళి


వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: శ్రీకృష్ణదేవరాయలు దక్షిణ భారతదేశంలో విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన గొప్ప చక్రవర్తి, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర ప్రజలకు అభిమాన పాత్రుడు, కవిసార్వభౌముడు అని శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం అన్నారు. గురువారం శ్రీకృష్ణదేవరాయలు 495వ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో రాయల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేడంగిలో విశ్వ మానవ వేదిక వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వంగా నరసింహారావు, ముచ్చర్ల శ్రీరామ్, జక్కంపూడి కుమార్, గుడాల హరిబాబు, ముచ్చర్ల సంజయ్, మద్దాల వాసు, గుత్తుల సత్యనారాయణమూర్తి, వెంకటపతి వర్మ, జక్కంపూడి మధన్, మల్లుల సురేష్, బోనం చినబాబు, కానూరి ప్రభాకర్, సంగినీడి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు తప్పనిసరి


గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్యాధికారి సురేంద్ర

నరసాపురం రూరల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్థక వైద్యాధికారి సురేంద్ర అన్నారు. గురువారం నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం, సారవ గ్రామాల్లో సుమారు 3 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో ఏలికపాములు, బద్దె పురుగు, లివర్‌ఫ్లూక్ మొదలగు అంతర పరాన్న జీవుల వలన అనేక అనర్థాలు సంభవిస్తాయని, దీని వలన గొర్రెలు, మేకల పెంపకం దారులు 30 శాతం ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. నట్టల నివారణకు గాను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వ్యాక్సిన్లను గొర్రెలు, మేకలకు వేయించాలని సూచించారు. నరసాపురం మండలంలో సుమారు 8 వేల గొర్రెలు, 3 వేల మేకలు ఉన్నాయని డాక్టర్ సురేంద్ర పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గొర్రెల కాపరులు అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వివాహిత ఆత్మహత్య

నరసాపురం: పట్టణంలోని ఎన్టీర్ కాలనీ బళ్లవారిపేటలో గురువారం భర్తతో గొడవ పడి వివాహిత అనూష (32) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టుగా సమాచారం. భర్తతో గొడవ పడిన నేపథ్యంలో భర్త ఇంటిలో లేని సమయంలో ఈ ఘటనకు పాల్పడినట్టుగా తెలిసింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.